సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 3 । నవంబర్ । 2023

I



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు పలికాయి. మార్కెట్‌కు 9 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.8, సరాసరి రూ.16 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/19.8°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలి తీవ్రత పెరిగింది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రాగికి సర్కార్ 'మద్దతు'

- క్వింటా రూ.3,846తో కొనుగోళ్లు



అగళి: చిరుధాన్యాలు సాగుచేసే రైతులకు ప్రభుత్వం 'మద్దతు'గా నిలిచింది. రాగి పండించిన రైతులకు ఇబ్బందులు కలగకుండా క్వింటా రూ.3,846 ప్రకారం మద్దతు ధరతో కొనుగోలు చేస్తోంది. ఈ క్రమంలో శుక్రవారం మండలంలోని పీ బ్యాడిగేర రైతు భరోసా కేంద్రం ఆవరణలో రాగి కొనుగోలు కేంద్రాన్ని పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ ప్రారంభించనున్నారు. 10 రోజుల్లో సొమ్ము రైతు ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకున్నట్లు మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్ తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నూతన భవనాలను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాలను ఈ నెల 5వ తేదీ లోపు స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు, హౌసింగ్ నిర్మాణాలపై పంచాయతీ రాజ్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేకాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి 45 సచివాలయ, 47 ఆర్బీకే, 40 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని ఈ నెల 5వ తేదీలోపు సంబంధిత శాఖకు అప్పగించాలన్నారు. అలాగే వివిధ దశల్లో ఉన్న ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. నిర్మాణ పనుల్లో ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యాన్ని సహించబోనన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న తహసీల్దార్ రంగనాయకులు

గోరంట్ల: రోడ్డు ప్రమాద బాధిత కుటుంబానికి ప్రభుత్వం చేయూతనిచ్చింది. గత నెల 26న కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని వానవోలు గ్రామానికి చెందిన బోయ వెంకటాద్రి, లక్ష్మి దంపతులు మృతి చెందారు. వీరికి ప్రభుత్వం రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం జరిగిన రెండో రోజే బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శంకరనారాయణ చెక్కులు పంపిణీ చేశారు. అయితే బోయ వెంకటాద్రి దంపతులకు సంబంధించి అప్పట్లో రూ. 5 లక్షలే మాత్రమే అందజేశారు. మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం గురువారం అందించింది. తహసీల్దార్ రంగనాయకులు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులకు ఆ మేరకు చెక్కు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీరాములు, సహకార సంఘం అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఉప సర్పంచ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మెండుగా ఉపాధి





లేపాక్షి సమీపంలో ఉపాధి పనులు చేస్తున్న మహిళా కూలీలు (ఫైల్)

మడకశిర మండలం ఎల్లోటి వద్ద పొలంలో సరిహద్దు కందకాల పనులు చేస్తున్న కూలీలు వీరు. నియోజకవర్గంలో 35,871 ఉపాధి జాబ్ కార్డులు ఉండగా 1,316 జాబ్ కార్డు కూలీలు వంద రోజుల ఉపాధి పనులను పూర్తి చేసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామ స్థాయిలోనే కూలీలకు ఉపయోగపడే పనులు కల్పించడంతో కూలీలు సద్వినియోగం చేసుకుంటున్నారు. వేకువజామునే పనికి వెళ్తూ ఉదయం 10 గంటలకే పూర్తి చేసుకుని ఇంటికి చేరుకుంటున్నారు. తర్వాత రైతుల పొలాల్లో కూలీ పనులకు వెళ్తున్నారు.

- ఉమ్మడి జిల్లాలో ఉపాధికి నిధుల వరద
- రికార్డు స్థాయిలో కుటుంబాలకు లబ్ధి
- ప్రభుత్వ చొరవతో భారీగా తగ్గిన వలసలు
- ప్రజల సంతోషాన్ని ఓర్వలేక 'పచ్చ' పత్రిక పిచ్చిరాతలు
- టీడీపీ హయాంలో 'నీరు–చెట్టు' పేరుతో దోచినా పట్టని వైనం

రాయదుర్గం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు దేశంలోనే ప్రత్యేకత చాటుకుంటున్నాయి. ఉన్న ఊళ్లోనే అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. నాలుగేళ్లలో కూలీల ఖాతాలకు ఉపాధి నిధులు వరదలా పారించారు. లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా కూలీల సంక్షేమానికే ఖర్చు చేశారు. గడిచిన నాలుగేళ్లలో రూ.2,382 కోట్లు కూలీలకు అందించారు. 1,128.43 కోట్లు మెటీరియల్ రూపంగా గ్రామ సచివాలయాలు, రైతుభరోసా, వెల్‌నెస్ కేంద్రాలు వంటి భవన నిర్మాణాలకు వినియోగించారు. ఇలా ప్రతి పైసా సద్వినియోగం చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారు.

కష్టకాలంలోనూ అండ..

కరోనా లాంటి విపత్తులో ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా గ్రామాలకు వచ్చి చేరారు. వారందరికీ సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. గ్రామ సచివాలయాల్లోనే జాబ్‌కార్డులు అందించి ఉపాధి పనుల్లో భాగస్వాముల్ని చేశారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉన్న ఊళ్లోనే పనులు కల్పించి తోడ్పాటు అందించారు.

'నీరు–చెట్టు'తో రూ.వేల కోట్లు వృథా..

టీడీపీ హయాంలో ఉపాధి నిధులన్నీ నీరు–చెట్టు పథకానికి మళ్లించారు. ప్రతి వంక, వాగులను స్వాధీనం చేసుకుని కొల్లగొట్టారు. కూలీల నోట్లో మట్టికొట్టారు. తమ జేబుల్లోకి రూ.వేల కోట్లు వేసుకున్నారు. పనులు లేక ఆనాడు ఊళ్లకు ఊళ్లు ఖాళీలు చేసిన దుస్థితి.

వలసన్న మాటే లేదు..

ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు మినహా నిజమైన కూలీలు తమ గ్రామాలు వదిలి నేడు ఎక్కడికీ వెళ్లడం లేదు. అయినా, టీడీపీ, దానికి వంత పాడే ఓ పత్రిక మాత్రం పచ్చసిరాతో పిచ్చిరాతలు రాస్తోంది. టీడీపీ హయాంలో పనిదినాల్లోనూ కోత విధించి రాక్షసుల్లా పంచుకుతిన్నా మాట్లాడని వారు నేడు ఎలా పడితే రాస్తుండడం చూసి జనం అసహ్యించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో జాబ్‌కార్డులు	4,23,065
లబ్ధి పొందిన కుటుంబాలు	4,23,065
హాజరైన కూలీలు	8.59 లక్షలు
కూలీలకు అందిన డబ్బు (రూ.లలో)	2,382.75 కోట్లు
మెటీరియల్ కోసం ఖర్చు (రూ.లలో)	1,128.43 కోట్లు

సద్వినియోగం చేసుకుంటున్నాం



ఉపాధి పనులు సంతృప్తస్థాయిలో కల్పిస్తున్నారు. పనులు చేసిన సత్వరం కూలీ వేతనం కూడా ప్రభుత్వం జమ చేస్తోంది. ఉపాధి పథకాన్ని కూలీలంతా సద్వినియోగం చేసుకుంటున్నాం. ఎక్కువ ఆదాయం ఆశించే వారు మాత్రమే పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అలాంటి వారు పండుగలు, శుభ కార్యాలయాలకు మాత్రమే వచ్చి వెళతుంటారు.

– బోయ అనంతమ్మ, ఉపాధి కూలీ, జుంజురాంపల్లి, రాయదుర్గం మండలం

దుష్ప్రచారం తగదు



గ్రామంలో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నారు. వలసలు వెళ్లాల్సిన అవసరం ఏ ఒక్కరికీ లేదు. ఇప్పటికే చాలా మంది వంద రోజుల పని దినాలు కూడా పూర్తి చేశారు. కరోనా సమయంలోనూ ఏ లోటు లేకుండా పనులు కల్పించి ఆకలిబాధలు తీర్చారు. కొంత మంది చేస్తోంది దుష్ప్రచారం మాత్రమే. అందులో ఎలాంటి వాస్తవం లేదు.

– రుక్మిణీ, ఉపాధి కూలీ, గొడిశెలపల్లి, డి హీరేహాళ్ మండలం

టాప్‌లో నిలబెట్టాం



కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాం. ప్రతి ఏడాది ప్రణాళికలు చేపట్టాం. ఉమ్మడి జిల్లాల్లో వలసన్న మాటే లేకుండా చేశాం. రాష్ట్రంలోనే జిల్లాకు ఉపాధి పనుల్లో పెద్దపీట వేశాం. గడిచిన నాలుగేళ్లలో రూ. 2,382.75 కోట్లు కూలీలకే ఖర్చుచేశాం. రూ.1,128.43 కోట్లు మెటీరియల్‌కు వెచ్చించాం. చెంతనే ఉపాధి ఉండగా వలసవెళ్లాల్సిన అవసరం ఉండదు.

– రామాంజనేయులు, డ్వామా పీడీ

భవనంపై నుంచి దూకి బాలిక ఆత్మహత్య

- ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని అఘాయిత్యం



ఆత్మహత్య చేసుకొన్న గౌరీ

పుట్టపర్తి రూరల్: తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని పుట్టపర్తి పట్టణంలో బాలిక గౌరీ (17) ఆత్మహత్య చేసుకొంది. పుట్టపర్తి అర్బన్ ఎస్‌ఐ వీరేష్ తెలిపిన మేరకు.. పుట్టపర్తి పట్టణంలోని డ్వాక్రా బజార్ సమీపంలో శ్రీనివాస డెవలపర్స్ పేరుతో నిర్మాణాలు జరుగుతున్నాయి. అక్కడ గోరంట్ల మండలం బూడిదగడ్డపల్లికి చెందిన గంగాద్రి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు కుమార్తె గౌరీ, కుమారుడు ఉన్నారు. డిగ్రీ చదవించడానికి ఆర్థిక స్థోమత లేక పుట్టపర్తిలో సూపర్ బజార్‌లో గౌరీని పనికి పంపుతున్నారు. తమ బంధువులతో ఆమెకు వివాహం చేయాలని గురువారం ఉదయం నిశ్చయించారు. పెళ్లి ఇష్టం లేని బాలిక సాయంత్రం ఏడంతస్తుల అపార్టుమెంట్‌పై నుంచి దూకింది. గుర్తించిన కుటుంబసభ్యులు స్థానిక సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. కుమార్తె మృతితో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రోదిస్తున్న తల్లిదండ్రులు

7న పుట్టపర్తికి సీఎం వైఎస్ జగన్



ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు



సమీక్షలో పాల్గొన్న జిల్లా అధికారులు

- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీన పుట్టపర్తికి విచ్చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈనెల 7న పుట్టపర్తి సభ నుంచే 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకం నిధులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులకు సీఎం విడుదల చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...సీఎం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడి నుంచి బహిరంగ సభకు వెళ్తారన్నారు. అందువల్ల విమానాశ్రయం నుంచి వైజంక్షన్ మీదుగా ప్రైవేట క్రికెట్ మైదానం, పోలీస్ పరేడ్ గ్రౌండు వరకూ రహదారుల వెంట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన పాస్‌ల జారీ పుట్టపర్తి ఆర్డీఓ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కాన్వాయ్‌కు సంబంధించిన వివరాలు రవాణాశాఖ అధికారి, శానిటేషన్, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చేయాలన్నారు. అంబులెన్స్‌లు, వైద్య శిబిరాల ఏర్పాట్లు వైద్యఆరోగ్య శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. సీఎం బహిరంగ సభ కోసం శుక్రవారం వైజంక్షన్‌లోని మైదానాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సభకు రైతు భరోసా లబ్ధిదారులతో పాటు ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుదర్శన్, డీపీఓ విజయ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ శాంతికి అశ్రు నివాళి..!

చనిపోయిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సమస్త పరిశుద్ధ ఆత్మల పండుగను గురువారం నిర్వహించారు. సమాధుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చనిపోయిన తమవారిని గుర్తు చేసుకొని నివాళులర్పించారు.

– సాక్షిబృందం




హిందూపురంలోని శ్మశాన వాటికలో నివాళులర్పిస్తున్న క్రైస్తవులు

మింగేస్తున్న ఆన్‌లైన్ గేమింగ్

☛ నాలుగు నెలల క్రితం కొత్తచెరువు మండలం తలమర్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆన్‌లైన్ గేమింగ్‌లో బెట్టింగ్‌కు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. విచారణ చేయగా ఆర్థికంగా బాగా నష్టపోయినట్లు వాపోయాడు. ''పోగొట్టుకున్న సొమ్మును రాబట్టుకునే క్రమంలో ఆడుతున్నాను.. కానీ జూదానికి బానిస కాలేదు''ని సమాధానం ఇచ్చాడు. అతడితో ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడిన వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

☛ కనగానపల్లి మండలానికి చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ రమ్మీ ఆడి రూ.12 లక్షల బకాయి పడ్డాడు. చెన్నేకొత్తపల్లి మండలంగా అడ్రస్ ఉండటంతో బెంగళూరు నుంచి కొందరు వెతుక్కుంటూ వచ్చారు. ఫోన్ నంబరు ద్వారా గాలిస్తే కనగానపల్లిలో పట్టుబడ్డాడు. కిడ్నాప్ చేస్తామని బెదిరించి డబ్బు లాక్కొని వెళ్లిపోయినట్లు సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తల్లిదండ్రులు తెలిపారు.

- భారీగా నష్టపోతున్న యువత
- నిషేధిత పేకాట వైపు ఎక్కువ మంది మొగ్గు
- జీవితాలు నాశనం చేసుకోవద్దని పోలీసుల హితవు



సాక్షి, పుట్టపర్తి: నిషేధిత ఆన్‌లైన్ గేమ్‌లలో యువకులు అప్పు చేసి బెట్టింగ్ పెడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆఫ్‌లైన్‌లో రమ్మీ ఆడటానికి ఇబ్బంది పడే పేకాటరాయుళ్లు ఎంచక్కా మొబైల్ నుంచే జూదం ఆడుతూ బానిసలుగా మారుతున్నారు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేసి గేమ్‌లు ఆడుతున్నారు. ఈ బెట్టింగ్‌లో ఒకేసారి ఆరుగురు ఆడటానికి అవకాశం ఉంటుంది. వివిధ మొబైల్ యాప్‌ల ద్వారా ఆడే ఆన్‌లైన్ గేమ్స్ చాలా ఉన్నప్పటికీ ఎక్కువ మంది రమ్మీనే ఆడుతున్నట్లు సమాచారం. రమ్మీతో పాటు మట్కా, క్రికెట్ బెట్టింగ్ తదితర జూదాలన్నీ ఆన్‌లైన్ ద్వారానే సాగిస్తున్నారు. జూదగాళ్లను పట్టుకోవడం పోలీసులకు కూడా సవాల్‌గా మారింది. ఎక్కడో ఓ రూములో కూర్చుని ఆన్‌లైన్ ద్వారా జూదం సాగిస్తున్న క్రమంలో పక్కా సమాచారం ఉంటే కానీ దాడి చేయలేని పరిస్థితి.

కొన్నేళ్ల క్రితమే నిషేధం..

రాష్ట్రంలో కొన్నేళ్లుగా పేకాట, మట్కాపై నిషేధం ఉంది. అయితే ఇతర రాష్ట్రాల్లో ఆన్‌లైన్ గేమింగ్‌కు అనుమతులు ఉన్నాయి. ఫలితంగా చాలామంది టెక్నాలజీని అందిపుచ్చుకుని ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడ్డారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ స్మార్ట్ ఫోన్లు వినియోగిస్తూ.. ఫేక్ జీపీఎస్ ద్వారా ఇతర రాష్ట్రాల లొకేషన్లు సెట్ చేసుకుని ఆన్‌లైన్ ద్వారా రమ్మీ కల్చర్‌కు బానిసలుగా మారుతున్నారు. డిజిటల్ లావాదేవీల ద్వారా నగదు బదిలీ చేసుకుంటూ.. నిత్యం అదే యావలో మునిగిపోతున్న వారు చాలా మంది ఉన్నారు.

వెబ్‌సైట్ల నుంచి అవకాశం..

ఆన్‌లైన్ గేమ్ ఆడుతున్న వ్యక్తి లొకేషన్ వేరే ప్రాంతాల్లో చూపిస్తుండటంతో ఆయా వెబ్‌సైట్లు గేమ్ ఆడేందుకు అవకాశం కల్పిస్తున్నాయి. ఫలితంగా ఆన్‌లైన్ జూదం యాప్‌ల దందా మూడు పూవులు, ఆరు కాయలు అన్న చందంగా సాగుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌రాయుళ్లపై పోలీసులు దృష్టి సారించి ఆట కట్టించాల్సిన అవసరం ఉన్నప్పటికీ సరైన లొకేషన్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నట్లు చెబుతున్నారు.

కఠిన చర్యలు తీసుకుంటాం



ఆన్‌లైన్ జూదం నిషేధం. ఎక్కడ ఆడినట్లు సమాచారం వచ్చినా వెంటనే పట్టుకుని కేసులు నమోదు చేస్తాం. ఆటగాళ్లను అదుపులోకి తీసుకుంటాం. యువతపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి. ఆన్‌లైన్ గేమ్స్ ద్వారా జీవితం నాశనం అవుతుంది. ఆర్థికంగా దెబ్బతిని కుటుంబం చిన్నాభిన్నం అవుతుంది. ఎవరూ ఆన్‌లైన్ జూదం వైపు మొగ్గు చూపవద్దు.

– ఎస్పీ మాధవ్‌రెడ్డి, ఎస్పీ

ఘనంగా 'భద్రావతి' గోల్డెన్ జూబ్లీ వేడుకలు

ప్రశాంతి నిలయం: భద్రావతి సత్యసాయి సేవా సమితి గోల్డెన్ జూబ్లీ వేడుకలను గురువారం ప్రశాంతి నిలయంలో ఘనంగా నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలోని భద్రావతిలో 1961లో సత్యసాయి భక్తులు భద్రావతి భజన్ సెంటర్ ప్రారంభించగా, 1972లో అది సత్యసాయి సేవా సమితిగా రూపాంతరం చెందింది. ఇప్పటివరకూ 5.5 లక్షల మందికి వైద్య సేవలు అందించారు. నారాయణ సేవా కార్యక్రమాల ద్వారా 23 లక్షల మందికి అన్నదానం చేశారు. 50 వేల మంది చిన్నారులకు బాలవికాస్ ద్వారా విద్యాబుద్ధులు నేర్పారు. సమితి ప్రారంభించి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సుమారు 2 వేల మంది కర్ణాటక సత్యసాయి భక్తులు పుట్టపర్తికి చేరుకుని ప్రశాంతి నిలయంలో గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర సేవా కోఆర్డినేటర్ ప్రభాకర్ బీరయ్య మాట్లాడారు. రాష్ట్ర ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ సౌమ్యా ప్రభాకర్, ఉత్తర కర్ణాటక సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు పద్మనాభ పాయ్‌లు భద్రావతి సేవా సమితి ద్వారా అమలవుతున్న సేవా కార్యక్రమాలు వివరించారు. 'ప్రేమా ఔర్ సేవా సమర్పణ్' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్వాన్ శ్రీపీకే పద్మనాభ బృందం వీణా వాయిద్య కచేరీ నిర్వహించారు. ఉత్తర కర్ణాటక సంస్కృతీ సంప్రదాయాలు, సత్యసాయి వైభవాన్ని చాటుతూ చేపట్టిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.



వాయిద్య కచేరీ నిర్వహిస్తున్న పద్మనాభ బృందం



సత్యసాయి బాల వికాస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

92 శాతం పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. రెండవ రోజు గురువారం నాటికి 92 శాతం పూర్తయ్యింది. జిల్లాలో 2,73,076 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.75,89,45,000 మంజూరు చేసింది. దీంతో తొలిరోజు ఇంటింటికీ తిరిగి పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు, గురువారం సుదూర ప్రాంతాల్లో ఉన్న లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛన్ అందజేశారు. ఫలితంగా రెండు రోజుల్లోనే 2,51,349 మందికి రూ. 69,83,40,000 అందించగలిగారు. పింఛన్ పంపిణీకి ఇంకా మూడు రోజుల గడువు ఉందని, తప్పకుండా వందశాతం పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.



బత్తలపల్లి మండలం అప్పరాచెరువులో వృద్ధునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

క్లుప్తంగా

తక్కువ వడ్డీకే రుణాలు



ముదిగుబ్బ: సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత

ఓడిచెరువు: అన్ని బ్యాంకుల కన్నా ఏడీసీసీ బ్యాంకులో తక్కువ వడ్డీకే రుణాలను మంజూరు చేస్తున్నట్లు డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత పేర్కొన్నారు. గురువారం ఓడీ చెరువులో సొసైటీ బ్యాంకు సిబ్బంది, అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతులు, మహిళలకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. లిఖిత మాట్లాడుతూ బ్యాంకు ద్వారా జగనన్న పాలవెల్లువ, జగనన్న తోడు, జేఎల్‌జీ రుణాలు, బంగారంపై తక్కువ వడ్డీకే రుణాలను ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎలాంటి రుణాలకైనా ప్రాసెసింగ్ ఫీజులు లేకుండా రుణాలను ఇస్తున్నామన్నారు. అనంతరం రుణాల కోసం రూ 1.50 కోట్ల చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సురేఖావాణి, జిల్లా డైరెక్టర్లు హైదర్‌వలి, శంకర్‌రెడ్డి, బ్యాంకు మేనేజర్ అర్చన, సొసైటీ అధ్యక్షుడు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని ఏడీసీసీ బ్యాంకును గురువారం డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సంఘాల అభివృద్ధి కోసం నిర్మించిన నాబార్డ్ గ్రామీణ రైతు సంత నిరుపయోగంగా ఉందని, దాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పెట్రోల్ బంక్ నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభం కాలేదని అడిగి తెలుసుకున్నారు.

కొనసాగుతున్న సెబ్‌దాడులు



బాలప్పగారిపల్లి తండాలో బెల్లం ఊటను ధ్వంసం చేసిన పోలీసులు

పుట్టపర్తిటౌన్: జిల్లా వ్యాప్తంగా సెబ్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు హిందూపురం, మడకశిర, కదిరి, సెబ్‌స్టేషన్ల పరిధిలో దాడులు చేశారు. హిందూపురం, మడకశిర , కొడికొండ చెక్ పోస్ట్ దగ్గర నిర్వహించిన దాడుల్లో 138 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని రెండు కేసులు నమోదు చేశారు. అలాగే కదిరి సెబ్‌స్టేషన్ పరిధిలో బాలప్పగారిపల్లి తండాలో 105 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కేసులు నమోదు చేసి ద్విచక్ర వాహనాలు సీజ్ చేశారు.

నేడు అభ్యసన సామర్థ్య పరీక్ష

ప్రశాంతి నిలయం: జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 1,123 పాఠశాలల్లో 3, 6, 9 తరగతుల విద్యార్థులు 28,391 మంది శుక్రవారం స్టేట్ ఎడ్యుకేషన్ అసెస్‌మెంట్ సర్వే (అభ్యసన సామర్థ్య పరీక్ష) నిర్వహించనున్నట్లు డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో తెలిపారు. 1,123 ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లుగా నియమించామన్నారు. ఏవైనా సందేహాలుంటే 9440768432, 8008158628 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ కార్గో సేవలు విస్తృతం

- పది కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సదుపాయం
- కొత్తగా మరిన్ని పట్టణాలకు విస్తరణ
- త్వరలోనే అందుబాటులోకి పికప్ సేవలు



హిందూపురం ఆర్టీసీ డిపోలోని కార్గో పార్శిల్ ఆఫీసు

హిందూపురం: ఏపీఎస్ఆర్టీసీ కార్గో సేవలను మరింత విస్తృతం చేస్తోంది. ఇప్పటికే ఆర్టీసీ ప్రారంభించిన డోర్ డెలివరీకి ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. అయితే ఇప్పటివరకు పరిమిత స్థాయిలో పంపిణీ సాగుతోంది. సుమారు 65 శాతం పైబడి ఖాతాదారులు డోర్‌డెలివరీకే ప్రాధాన్యతమిస్తున్నట్లు ఆర్టీసీ యాజమాన్యం నిర్వహించిన సర్వేలో కూడా వెల్లడైంది. దీంతో ఆర్టీసీ డోర్ డెలివరీ వ్యవస్థను మరింత విస్తృతం చేయడంతో పాటు బలపేతం చేయడానికి ఆ సంస్థ సన్నాహాలు చేస్తోంది.

రోజుకు 50కు పైగా డోర్ డెలివరీలు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో కార్గో సేవను విస్తృతం చేశారు. పట్టణాలకు 10 కిలోమీటర్ల పరిధిలో డోర్‌డెలివరీ చేయనున్నారు. ఇందులో భాగంగా కొరియర్ కవర్లు, కిలో నుంచి 50 కిలోల బరువు ఉన్న పార్శిల్స్‌కు పరిమితమైన ప్రత్యేక రుసుంతో డోర్ డెలివరీ చేయనున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో సగటున రోజు 50కు పైగా డోర్ డెలివరీలు చేస్తున్నారు. డోర్ డెలివరీ చేయడానికి రాష్ట్రంలో జోన్ల వారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు.

అందుబాటులోకి డిజిటల్ పేమెంట్లు..

ఆర్టీసీలో కార్గో సేవలు విస్తృతం చేయడంలో భాగంగా ఆర్టీసీ యాజమాన్యం డిజిటల్ పేమెంట్ సిస్టంను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, కార్గో సెంటర్లలో డిజిటల్ పేమెంట్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఏ మనీ ట్రాన్సాక్షన్ సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీనివల్ల సులభతరంగా చెల్లింపులతో పాటు సత్వర సేవలు కొనసాగించడానికి వీలు కల్పిస్తున్నారు.

విస్తృతంగా ప్రచారం..

ఆర్టీసీ సంస్థ ద్వారా సరుకు రవాణా, కార్గో సేవలపై ప్రచారాన్ని విస్తృతం చేశారు. ఇందులో భాగంగా డోర్‌డెలవరీ ప్రచార మాసోత్సవాలు పేరిట ఈనెల 25 వరకు డిపోల వారీగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. పార్శిల్, కొరియర్, సరుకు రవాణాలో భాగస్వాములుగా చేయడానికి ఏజెంట్లు, ఆపరేటర్లు వివిధ రకాలుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, వాణిజ్య దుకాణాలు, కిరణా స్టోర్లు, విద్యాసంస్థలు తదితర చోట్ల ఆర్టీసీ డోర్ డెలవరీ సదుపాయం గురించి వివరిస్తున్నారు. దీంతో పాటు కరపత్రాలు, లోకల్ టీవీ కనెక్షన్లలో, ఆడియో, వీడియో రూపాల్లో విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. ఇందుకు ఆర్టీసీ సంస్థ ఉద్యోగులు సహకారం కూడా కోరుతున్నారు. డిపోల వారీగా అధికారులను వ్యాపారులను పిలిచి సమావేశాలు నిర్వహించనున్నారు.

డోర్ డెలివరీ వివరాలు...	
పార్శిల్స్, కొరియర్	ధరలు
కిలో	రూ.18
ఆరు కిలోల	రూ.30
పది కిలోలు	రూ.36
25 కిలోలు	రూ.48
25-50 కిలోలు	రూ.59

త్వరలోనే పికప్ సదుపాయం



ఆర్టీసీ కార్గో సేవలపై ప్రజల్లో విశ్వసనీయత ఉంది. ఆర్టీసీలో బుక్‌చేసిన సరుకులు, పార్శిళ్లు భద్రంగా 24 గంటల్లో రాష్ట్రంలోని అన్ని ప్రధాన ప్రాంతాలకు చేరవేసి ప్రజాదారణ పొందుతున్నాం. డోర్‌డెలివరీతో సేవలు విస్తృతం చేస్తున్నాం. డోర్‌డెలివరీతో పాటు త్వరలో పికప్ సదుపాయం కూడా అందుబాటులోకి తెస్తాం. ప్రజలు కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. – మధుసూదన్, జిల్లా ప్రజారవాణా అధికారి

యాచకుడి మృతి



మృతి చెందిన యాచకుడు

పెనుకొండ: పట్టణంలోని దర్గా సమీపంలో గురువారం ఉదయం గుర్తు తెలియని యాచకుడి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ రాజేష్ వివరాలమేరకు.. దర్గా సమీపంలో ఓ వ్యక్తి కొంతకాలంగా యాచన చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అతను మద్యానికి బానిసై అనారోగ్యంతో చనిపోయినట్లు చెప్పారు. ఉదయం ఆ ప్రాంత వాసులు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లామన్నారు. శవపంచనామా అనంతరం మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కళ్యాణదుర్గం: ఐచర్ వాహనంలో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్‌లో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. గురువారం ఉదయం పక్కా సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఎస్‌ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఈఈఈ రాజశేఖర్‌లు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఐచర్ (ఏపీ02టీఏ7739) వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 147.50 క్వింటాళ్ల (330 బ్యాగులు) రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఐచర్ వాహనంతో పాటు బియ్యంను సీజ్ చేశారు. నిబంధనల మేరకు కళ్యాణదుర్గం సీఎస్‌డీటీ సుబ్రమణ్యంకు స్వాధీనం చేశారు. నిందితులైన బియ్యం యజమాని మధుబాబు, డ్రైవర్ రాజశేఖర్, వాహన యజమాని నాగభూషణరెడ్డిపై కళ్యాణదుర్గం పట్టణ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పల్లె బాట.. ప్రగతి మాట

- రహదారుల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత
- ఉమ్మడి అనంత జిల్లాలో రూ.50.4 కోట్లతో 14 రోడ్ల నిర్మాణానికి అనుమతి
- 69.3 కిలోమీటర్ల మేర పూర్తిగా అభివృద్ధి చెందనున్న రోడ్లు
- టెండర్ల ద్వారా పనుల కేటాయింపు

అనంతపురం సిటీ: గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. అత్యంత ప్రాధాన్యత కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 రహదారుల నిర్మాణాలకు, పాడైన రహదారులు.. వంతెనల మరమ్మతులకు అనుమతులు మంజూరు చేసింది. మొత్తం 69.3 కిలోమీటర్ల మేర రహదారులను రూ.50.4 కోట్ల వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో తొమ్మిది రహదారులకు రూ.41 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో ఐదు రోడ్లకు రూ.9.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

టెండర్ల ద్వారా పనుల అప్పగింత

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించాం. ఈ ప్రక్రియ పూర్తికాగానే పనులు కేటాయిస్తాం. రహదారులు, వంతెన నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోంది.
– యమ్మాని భాగ్యరాజ్, సూపరింటెండెంట్ ఇంజినీర్, పీఆర్, అనంతపురం సర్కిల్

నియోజకవర్గాల వారీగా మంజూరైన నిధులు ఇలా..

నియోజకవర్గం	రోడ్డు పేరు	కి.మీ.	కేటాయించిన మొత్తం
శింగనమల	శింగనమలలో అంతర్గత రహదారులు	0.74	రూ. కోటి
కళ్యాణదుర్గం	కన్నేపల్లి - యాటకల్లు వయా నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం	21.49	రూ.13 కోట్లు
గుంతకల్లు	పామిడిలో సీసీ రోడ్లు	5.60	రూ.5 కోట్లు
రాయదుర్గం	బాదన్‌హాళ్ - గొడిసేపల్లి బీటీ రోడ్డు	2.93	రూ.80 లక్షలు
రాయదుర్గం	వేదవతి రిజర్వాయర్‌పై వంతెన	0.30	రూ.6 కోట్లు
ఉరవకొండ	గుంతకల్లు- ఉరవకొండ (పందికుంట క్రాస్ వరకు)	4.97	రూ.1.85 కోట్లు
ఉరవకొండ	కూడేరు-మరుట్ల-3 కాలనీ వరకు	12.80	రూ.6.40 కోట్లు
కళ్యాణదుర్గం	కన్నేపల్లి- భూపసముద్రం	0.17	రూ.30 కోట్లు
తాడిపత్రి	చిట్టూరు-తరిమెల	2.36	రూ.5 కోట్లు
ధర్మవరం	జొన్నలకొత్తపల్లి తండా అప్రోచ్ రోడ్డు	2.00	రూ.1.05 కోట్లు
పెనుకొండ	చంద్రగిరి - వెంకటగిరి పాళ్యం రోడ్డు	1.00	రూ. 70 లక్షలు
రాప్తాడు	ఆర్‌అండ్‌బీ రోడ్డు - సుద్దకుంటపల్లి రోడ్డు	3.00	రూ.1.60 కోట్లు
రాప్తాడు	పీఆర్ కొట్టాల అప్రోచ్ రోడ్డు	6.60	రూ.3 కోట్లు
పుట్టపర్తి	వెంగళమ్మ చెరువు - నార్సింపల్లి తండా	5.34	రూ. 2.60 కోట్లు

పట్టు రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలు

- జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లను పరిశీలిస్తున్న ఆవుటాల రమణారెడ్డి

ధర్మవరం రూరల్: మల్బరీ తోటల సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం రైతులకు మరిన్ని ప్రోత్సాహకాలను అందించడానికి సిద్ధంగా ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి అన్నారు. గురువారం ఆయన ధర్మవరంలో పట్టుగూళ్ల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న రైతులు, పట్టుగూళ్ల వ్యాపారస్తులు, అధికారులతో పట్టుగూళ్ల ధరలు, మల్బరీ తోటల సాగు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పట్టుగూళ్లకు మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్నాయన్నారు. ఈ ధరలు రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. గత టీడీపీ హయాంలో కరువు కారణంగా బోరు బావుల్లో నీరు లేక చాలా మంది రైతులకు చెందిన మల్బరీ తోటలు ఎండిపోయాయన్నారు. సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వర్షాలు సమృద్ధిగా కురిసి బోరు బావుల్లో నీరు పుష్కలంగా వస్తోందన్నారు. దీంతో చాలా మంది రైతులు మల్బరీ తోటలు సాగు చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించుకుంటున్నారన్నారు. మల్బరీ రైతులు నాణ్యమైన పట్టు గూళ్లను ఉత్పత్తి చేయిస్తుండడంతో మార్కెట్‌లో మంచి ధరలు పలుకుతున్నాయన్నారు. రైతులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన ఇన్‌సెంటివ్ బకాయిలు కూడా త్వరలోనే మంజూరు కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఏడీ నరసింహులు, టీటీలు దామోదర్‌రెడ్డి, రమణారెడ్డి, రీలర్లు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు తెలుసుకోకుండా దుష్ప్రచారం



శ్రావణి, వారి కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడుతున్న విప్ కాపు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- జగనన్న మేలును మరువలేమన్న శ్రావణి

రాయదుర్గం: పేదింటి బిడ్డ శ్రావణిని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్ ఆదుకున్న విషయాన్ని అసెంబ్లీలో చర్చిస్తే దాన్ని టీడీపీ నాయకులు వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేయడంపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోకుండా పచ్చ ద్రోహులు కొందరు అత్యుత్సాహం చూపేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో శ్రావణి, వారి కుటుంబ సభ్యులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు. డీ హీరేహాళ్ మండలం జాజరకల్లుకు చెందిన లక్ష్మి, జీ రామిరెడ్డిల కుమార్తె శ్రావణి ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. వారి స్వగ్రామంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైనట్లు చెప్పారు. ఆ సమయంలో శ్రావణికి ఉన్న చెవిటి, మూగ సమస్య తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం శస్త్ర చికిత్సలు జరిపారన్నారు. 15 ఏళ్లుగా మూగ, చెవిటితో బాధపడిన శ్రావణిని రాష్ట్ర ప్రభుత్వం మామూలు మనిషిగా తయారు చేసిందని వెల్లడించారు. శుభకార్యానికి వెళ్లినప్పుడు ఆ అమ్మాయి బాగున్నారా సార్.. మీకు, సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం అని చెప్పిందన్నారు. శ్రావణి లాంటి వారికెందరికో రాష్ట్ర ప్రభుత్వం మేలు చేకూర్చిన విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు చెప్పారు. దాన్ని కూడా ట్రోల్ చేస్తుండటం హేయమైన చర్యన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

అమ్మ, నాన్న జన్మనిస్తే సీఎం జగన్ పునర్జన్మనిచ్చాడని శ్రావణి తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించకపోతే చెవిటి, మూగ దానిలానే జీవితం చాలించాల్సి వచ్చేదన్నారు. మంచిచేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించాల్సిందిపోయి తప్పుపట్టేలా మాట్లాడడం పద్ధతి కాదని శ్రావణి తల్లి లక్ష్మి అన్నారు. మా బిడ్డకు చేసిన మేలు తమకు మాత్రమే తెలుసని, రాజకీయ స్వార్థం కోసం మాట్లాడే వెదవలకు ఏం అర్థమవుతుందని మండిపడ్డారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

GNM నర్సింగ్ అడ్మిషన్స్

- ఇంటర్ పాస్ స్టూడెంట్స్‌కి గర్ల్స్ కాలేజీలో Govt. సీట్స్ GNM (నర్సింగ్) నందు ఫ్రీ ఎడ్యుకేషన్, కాలేజీ లో హాస్టల్ వసతి కలదు. సంప్ర : జి. మురళి, 9030661651, ATP. [A-2749]

SERVICES

- మోకాళ్ళ నొప్పులకు, కీళ్ల నొప్పులకు, మెడనొప్పి, విరిగిన ఎముకలకు మొ॥ చికిత్సలకు అహ్మద్ ఆర్థోపెడిక్ హాస్పిటల్, ATP. 9866689481. [A-315]

బంగారం కొనబడును

- మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-5951]

BUSINESS OFFER

- ప్లాస్టిక్ కవర్లకు ప్రత్యామ్నాయం, పర్యావరణానికి అనుకూలం. 100% ఆర్గానిక్ విలువలతో తయారవుతున్న బయోడిగ్రేడబుల్ కవర్లను మార్కెటింగ్ చేయుటకు డిస్ట్రిబ్యూటర్స్, డీలర్లు మరియు మార్కెటింగ్ సిబ్బంది కావలెను. సంప్రదించండి: 9281159721, 8919551629 [H-788343]

WANTED

- త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K. Ph: 9848571888/9640400073 [HA-794]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1221861]
- JOBS : 2 Males & One Female Executives Required to Work in a Reputed 2 Wheeler E.V. Show room. Experience is must in sales. Attractive salary. Contact : THE BIKERS HUB: 8074331574, ATP. [A-776940]
- మీరు ఉన్నచోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) ఎటువంటి ఫీసులు లేవు. సంప్ర : 95020 28361 [V-797443]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర॥ 9177736926. [M-1221797]
- ప్రముఖ కంపెనీ యొక్క రికార్డ్స్ వ్రాసినందుకు వారంవారం అధిక ఆదాయం పొందండి. వివరాలకు ఫోన్ చేయండి. ఫోన్: 7730899503 [G-1180]
- రామకృష్ణ గ్రూపు, (AP No.1) VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు వర్కర్స్ కావలెను / 24x7 పంపగలము. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 91608 91122, 92814 52838. [B-1206459]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోడ్డుపై 'ఎయిర్ బస్'



భారీ లారీలో ఎయిర్ బస్‌ను తరలిస్తున్న దృశ్యం

సోమందేపల్లి: సాధారణంగా ఆకాశంలో విహరించే విమానం ఉన్నఫలంగా జాతీయ రహదారిపై ల్యాండ్ అయిందా? అన్న రీతిలో సోమందేపల్లిలో ఎయిర్ బస్ దర్శనమిచ్చింది. గోరంట్ల మండలంలో ఏర్పాటవుతున్న నాసిన్ సంస్థ ఎయిర్ బస్‌ను కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని పేటకుంట సమీపంలో ఎయిర్ బస్‌ను ఓ పెద్ద లారీలో తీసుకొచ్చారు. దీంతో బెంగళూరు – హైదరాబాద్ జాతీయ రహదారిపై కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. విమానాన్ని చూడటానికి ప్రజలు ఎగబడ్డారు. వాహనాలు ఆపి మరీ కొందరు ఫొటోలు తీసుకున్నారు.

ఘనంగా ఆవుల జాతర



ఆవుల జాతర నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంటలో ఆవుల జాతర ఉత్సవాన్ని యాదవ కులస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న ఆవుల గూడు వద్దకు యాదవ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆవులు , పశువులను భక్తులు ఆవుల గూడు చుట్టూ ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

ఉద్యోగావకాశాలు చేజార్చుకోవద్దు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఓబుళమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మరణించిన ఉద్యోగులకు సంబంధించి 106 మంది వారసులు ఉన్నారు. అయితే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేవలం ఆరు మాత్రమే ఉండగా, కార్యాలయ సబార్డినేట్ పోస్టులు 180 వరకు ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 48 మంది అర్హులు ఉన్నారు. అయితే అందరూ తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులే కావాలంటూ పట్టుబడుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్/జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు వారందరినీ గురువారం జెడ్పీకి పిలిపించారు. జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి (డీఎల్‌డీఓ) ఓబుళమ్మ మాట్లాడారు. కారుణ్య నియామకాలలో జరుగుతున్న జాప్యానికి వారసులే కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జూనియర్ అసిస్టెంట్ పోస్టే కావాలంటూ పట్టుబడుతున్నారని తెలిపారు. ఇలాగైతే ఏడు, ఎనిమిది సంవత్సరాలు నిరీక్షించాల్సి ఉంటుందని, అప్పటి వరకు ఎలాంటి జీతం ఉండదన్నారు. అదే సబార్డినేట్ ఉద్యోగంలో చేరితే నాలుగైదేళ్లలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందుతారని చెప్పారు. అప్పటి వరకు ప్రతి నెలా కనీసం రూ.30 వేలకు పైబడి జీతం వస్తుందని, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చన్నారు. కోరుకున్న ఉద్యోగమే కావాలంటే మాత్రం ఇప్పట్లో సాధ్యం కాదని, వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని సూచించారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



ఇందు (ఫైల్)

పుట్లూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కలకలం రేపుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి మండలం పెద్ద పొలమడ గ్రామానికి చెందిన వెంకటరమణ, హేమలత దంపతుల కుమార్తె ఇందు (17) పుట్లూరు కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం 5.45 గంటల సమయంలో ఇందు పరారైనట్లు కేజీబీవీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఎంఈఓ శ్రీదేవి, జీసీడీఓ మహేశ్వరితో పాటు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే పాఠశాల గేట్లు తెరవకుండా విద్యార్థిని బయటకు ఎలా వెళ్లింది? చదువుపై ఇష్టం లేక వెళ్లిందా? ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మిస్సింగ్ అయిన విద్యార్థి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. కేజీబీవీతో పాటు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. విద్యార్థిని తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ హనుమంతు తెలిపారు.

మట్కా బీటర్ అరెస్ట్

మడకశిర: పట్టణంలోని ఓ బట్టల దుకాణంలో మట్కా చీటీలు రాస్తున్న మండలంలోని గుడ్డంపల్లికి చెందిన రంగధామ అనే బీటర్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లోకేశ్ తెలిపారు. అతని నుంచి రూ.29,980 నగదుతో పాటు మట్కా చీటీలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాల మేరకు మట్కాపై ఉక్కుపాదం మోపుతున్నామని, ప్రజలు కూడా మట్కాపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సెమిస్టర్, బీఎస్సీ ఐదో సెమిస్టర్, బీకాం ఆరో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు జ్ఞాన భూమి పోర్టల్‌లోనూ అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థం



మాట్లాడుతున్న సెబ్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

గుంతకల్లు రూరల్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బుద్ధిగా చదువుకొని భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, సెబ్ అధికారులు పాల్గొన్నారు.